క్లుప్తంగా

కళ్లద్దాల పంపిణీ



ఉచితంగా కళ్లద్దాలను అందజేస్తున్న కుసుమంచి సుబ్బారావు

విజయనగరం: పర్యావరణ పరిరక్షణలో భాగంగా ప్రధాని నరేంద్ర మోదీ పిలుపు మేరకు ప్రతిఒక్కరు తమ తల్లి పేరుతో ఒక మొక్కను నాటాలని స్వచ్ఛభారత్ కోఆర్డినేటర్ కుసుమంచి సుబ్బారావు కోరారు. ఈ మేరకు మంగళవారం పూల్‌బాగ్ కాలనీ సరస్వతి శిశు మందిర్ ప్రాంగణంలో మొక్కలు నాటే కార్యక్రమానికి మంగళవారం శ్రీకారం చుట్టారు. అనంతరం నగరంలో ఉచిత నేత్ర వైద్య శిబిరాన్ని నిర్వహించి అవసరమైన వారికి మందులు, కళ్లద్దాలను అందజేశారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు అబ్దుల్ ఆదిల్, రాంబాబు రాంబాబు, సామాజిక కార్యకర్త ధవళ సర్వేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

అతిసారపై అప్రమత్తతే ప్రధానం



పోస్టర్‌ను విడుదల చేస్తున్న ఎంపీపీ సుధారాణి, తదితరులు

నెల్లిమర్ల: అతిసార ప్రబలకుండా చర్యలు చేపట్టాలని ఎంపీపీ అంబళ్ల సుధారాణి అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సతివాడ, కొండవెలగాడ పీహెచ్‌సీల వైద్య సిబ్బందితో మంగళవారం సమావేశమయ్యారు. వర్షాకాలాన్ని దృష్టిలో పెట్టుకుని అంటువ్యాధులు వ్యాప్తి చెందకుండా చూడాలన్నారు. పారిశుద్ధ్య పనులను ముమ్మరం చేయాలని సూచించారు. అనంతరం స్టాప్ డయేరియా పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో సౌత్ సెంట్రల్ రైల్వే సలహా మండలి సభ్యుడు అంబళ్ల శ్రీరాములు నాయుడు, ఎంపీడీఓ జి.రామారావు, పీహెచ్‌సీల వైద్యాధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

విపత్తులపై అవగాహన



పాఠశాల ఆవరణలో మొక్కలు నాటుతున్న ఎన్‌డీఆర్‌ఎఫ్ సభ్యులు, విద్యార్థులు

విజయనగరం రూరల్: జాతీయ విపత్తుల సమయంలో తీసుకోవాల్సిన చర్యలపై విజయనగరంలోని వీటీ అగ్రహారం జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులకు జాతీయ విపత్తుల నివారణ సంస్థ (ఎన్‌డీఆర్‌ఎఫ్) సభ్యులు మంగళవారం అవగాహన కల్పించారు. జాతీయ విపత్తుల సమయంలో నష్ట నివారణ ఎదుర్కోవడానికి ప్రజలను సంసిద్ధం చేయడానికి తీసుకోవాల్సిన చర్యలను ఎన్‌డీఆర్‌ఎఫ్ ఎస్‌ఐ సుశాంత్‌కుమార్ బెహరా వివరించారు. చెట్ల పెంపకం, అడవుల సంరక్షణ, కాలుష్యం, ప్లాస్టిక్ నియంత్రణ చర్యలను తెలియజేశారు. అనంతరం పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ బి.సంజీవ్‌కుమార్, హెచ్‌ఎం రాజేశ్వరరావు, ఎన్‌డీఆర్‌ఎఫ్ సిబ్బంది, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సన్నిబాబు చిరస్మరణీయుడు



సన్నిబాబు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

నెల్లిమర్ల: సీపీఐ సీనియర్ నాయకుడు, కళాకారుడు స్వర్గీయ తాలాడ సన్నిబాబు చిరస్మరణీయుడని నగర పంచాయతీ వైస్ చైర్మన్ సముద్రపు రామారావు అన్నారు. నగర పంచాయతీ పరిధిలోని జరజాపుపేటలో సన్నిబాబు సంస్మరణ సభ మంగళవారం జరిగింది. ఈ సందర్భంగా గ్రామపెద్దలు, వివిధ పార్టీల నాయకులు సన్నిబాబు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఎరుబోరు సన్యాసిరావు, మద్దిల సన్యాసిరావు, నల్లిశ్రీను, కిల్లంపల్లి రామారావు, తదితరులు పాల్గొన్నారు.

ఆటో బైక్ ఢీ, ముగ్గురికి గాయాలు

భోగాపురం: మండలంలోని ముంజేరు గ్రామ సమీపంలో సోమవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో పలువురు గాయపడ్డారు. ఈ ఘటనపై పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని చోడిపిల్లి గ్రామానికి చెందిన పెద్దప్పన్న, నరసయ్యమ్మ దంపతులు తమ కుమారుడు చిన్నారావుతో కలిసి గర్భవతి అయిన తమ కోడలు దుర్గను ఆస్పత్రికి తీసుకువెళ్లేందుకు ఆటోలో విజయనగరం బయలుదేరారు. ముంజేరు గ్రామం వద్దకు చేరుకునేసరికి ఎదురుగా వస్తున్న ద్విచక్ర వాహనం ఆటోను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ముగ్గురికి స్వల్ప గాయాలు కాగా, స్థానికులు 108 వాహనంలో విజయనగరం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. దీనిపై నరసయ్యమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై సూర్యకుమారి తెలిపారు.

అవగాహనతో వ్యాధులకు చెక్

- కార్పొరేషన్ పరిధిలో స్టాప్ డయేరియా కార్యక్రమం
- చిన్న పిల్లలకు కాలానుగుణ వ్యాధులు సోకకుండా అవగాహన



చదువుకుంటున్న చిన్నారులు

విజయనగరం: ప్రస్తుత ఆధునిక ప్రపంచంలో వింతవింత వ్యాధులు ప్రబలుతున్నాయి. కాలనుగుణంగా సంక్రమించే వ్యాధులు గురించి చెప్పనక్కర్లేదు. వాతావరణం పరంగా ఏడాదిలో వచ్చే వేసవి, వర్షాకాలం, శీతాకాల సమయాల్లో ఈ సమస్య ఎక్కువగా ఉంటుంది. ఈ సమయంలో వ్యాధి నిరోధక శక్తి తక్కువగా ఉన్న 0-5 సంవత్సరాలలోపు చిన్నారులు తరుచూ వ్యాధులబారిన పడుతుంటారు. ఇందులో భాగంగా ప్రస్తుత వర్షాకాలంలో చిన్నారుల్లో నీళ్ల విరేచనాలను ఎదుర్కోవడానికి 'స్టాప్ డయేరియా' అనే పేరుతో వైద్య ఆరోగ్య శాఖ విజయనగరం మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో ప్రత్యేక కార్యక్రమాన్ని ప్రారంభించింది. ఈ కార్యక్రమాన్ని జూలై ఒకటి నుంచి ఆగస్టు 31వ తేదీ వరకు రెండు నెలలు కొనసాగించనుంది. వాస్తవానికి పిల్లల్లో నీళ్ల విరేచనాలన్నది మనం సాధారణంగా చూస్తుండే సమస్య. ఇది బ్యాక్టీరియా కారణంగా లేదా వైరస్ వల్ల రావొచ్చు. మనం ఏం చేయాలి? ఏం చేయకూడదన్నది ప్రజల్లో అవగాహన కల్పించేందుకు ఆశ, ఆరోగ్య కార్యకర్తలు ఇంటింటినీ సందర్శించనున్నారు.

పిల్లల సంరక్షణే లక్ష్యంగా...

నగరంలో 0-5 సంవత్సరాల వయసున్న చిన్నారులు సుమారు 30వేల మంది వరకు ఉండవచ్చని అంచనా. ఈ రెండు నెలల సమయంలో వైద్యారోగ్య శాఖ సిబ్బంది పిల్లలు ఉన్న ప్రతి ఇంటినీ సందర్శిస్తారు. డయేరియా అంటే ఏమిటో వివరిస్తారు. ఓఆర్‌ఎస్‌తో పాటు జింక్ మాత్రలు అందజేస్తారు. డయేరియాతో బాధపడే పిల్లలకు వీటిని ఏవిధంగా వాడాలో తల్లిదండ్రులకు తెలియజేస్తారు. మరోవైపు డయేరియా బారిన పడకుండా ఉండాలంటే ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలో సిబ్బంది వివరిస్తారు. చేతి, నీటి, ఆహారం, పాత్రలు, పరిసరాల శుభ్రత పాటిస్తే చాలావరకు నీళ్ల విరేచనాలు దరిచేరవని తెలియజేస్తారు. పిల్లలకు గడువు లోగా రోటా వైరస్ టీకాలు వేయిస్తారు.

పిల్లల ఆరోగ్యానికి పెద్దపీట

విరేచనాల కారణంగా ఐదేళ్ల లోపు పిల్లల్లో మరణాలు సంభవించకూడదనే లక్ష్యంతో పని చేస్తున్నాం. వైద్యారోగ్యశాఖ పరిధిలో రెండు నెలలు ప్రత్యేక కార్యక్రమం చేపట్టాం. దీన్ని పర్యవేక్షించేందుకు ప్రత్యేక కమిటీలు ఏర్పాటు చేశాం. అవసరమైన మేర ఓఆర్‌ఎస్, జింక్ మాత్రలను నిల్వ ఉంచాం. పిల్లలకు ఓఆర్‌ఎస్ ద్రావణం పట్టడంపై తల్లిదండ్రులకు అవగాహన పెంచుతున్నాం.

– కె.సాంబమూర్తి, ప్రజారోగ్య అధికారి, విజయనగరం కార్పొరేషన్

ప్రజల సహకారంతోనే పరిసరాల పరిశుభ్రత

- కార్పొరేషన్ కమిషనర్ ఎం.మల్లయ్యనాయుడు



కంటోన్మెంట్ ప్రాంతంలో పర్యటిస్తున్న కమిషనర్ మల్లయ్యనాయుడు

విజయనగరం: ప్రజల సహకారంతోనే నగరంలో పరిసరాల పరిశుభ్రత సాధ్యమని జయనగరం కార్పొరేషన్ కమిషనర్ ఎం.ఎం.నాయుడు అన్నారు. నగరంలోని వివిధ ప్రాంతాల్లో ఆయన మంగళవారం పర్యటించారు. పారిశుద్ధ్య పనుల తీరును గమనించారు. ఆయా ప్రాంతాల్లో ఉన్న పారిశుద్ధ్య పర్యవేక్షకులతో ఇంటింటి చెత్త సేకరణ, ప్లాస్టిక్ నిషేధం అమలు చేస్తున్న తీరును అడిగి తెలుసుకున్నారు. ఎక్కడ పడితే అక్కడ చెత్త వేయకుండా ప్రజల్లో మరింత అవగాహన తీసుకురావాలన్నారు. కంటోన్మెంట్, కలెక్టరేట్ ప్రాంతాల్లో పర్యటించిన కమిషనర్ కొన్ని ప్రాంతాల్లో అపరిశుభ్ర పరిస్థితులను చూసి పారిశుద్ధ్య పనివారలపై ఆగ్రహం వ్యక్తం చేశారు. మరోసారి పర్యటించే సమయంలో ఇటువంటివి పునరావృతం కాకూడదని హెచ్చరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాలానుగుణ వ్యాధులు ప్రబలే సమయంలో పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని నగర ప్రజలకు పిలుపునిచ్చారు. ప్రతి శుక్రవారం డ్రైడే పాటించి నీరు నిల్వలేకుండా చేయాలన్నారు. దోమల వృద్ధిని నియంత్రించడాన్ని ప్రతి ఒక్కరూ బాధ్యతగా భావించాలని తెలిపారు.

మౌలిక సదుపాయాల కల్పనకు ప్రాధాన్యం



కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే అదితి గజపతిరాజు

విజయనగరం: నగరంలో మౌలిక సదుపాయాల కల్పనకు అధిక ప్రాధాన్యమిస్తామని ఎమ్మెల్యే పూసపాటి అదితి గజపతిరాజు అన్నారు. స్థానిక బాలాజీ మార్కెట్లో మంగళవారం జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో మార్కెట్ అసోసియేషన్ ప్రతినిధులు ఎమ్మెల్యే అదితి గజపతి రాజును ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఆమె దృష్టికి పలు సమస్యలు తీసుకువెళ్లారు. దీనిపై ఆమె స్పందిస్తూ గూడ్సు షెడ్ జంక్షన్‌లో ఉన్న రైల్వే బ్రిడ్జి కింద రెండు వైపులా మార్గాలను తక్షణం ప్రారంభించి ట్రాఫిక్‌కు అంతరాయం లేకుండా చేస్తామన్నారు. పట్టణంలో పలు ప్రాంతాల్లో ప్రజలు, స్వచ్ఛంద సంస్థలు తమ దృష్టికి పలు సమస్యలు తీసుకువచ్చారని, నిధుల లభ్యత మేరకు ప్రాధాన్యతానుసారం పరిష్కరిస్తామన్నారు. బాలాజీ టెక్స్‌టైల్ మార్కెట్ అసోసియేషన్ ప్రెసిడెంట్ బొడ్డెపు వెంకటరావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో అసోసియేషన్ కార్యవర్గ ప్రతినిధులు సవర్‌మల్ చౌదరి, నిర్మల్ కుమార్ జైన్, కె.ఎల్.నరసింగరావు, పివి రామారావు, ప్రవీణ్ కుమార్ అంచిలియా, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

ఆరోగ్య జాగ్రత్తలతో డెంగీ దూరం



డెంగీ నివారణ ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

విజయనగరం రూరల్: వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రతతో పాటు ఆరోగ్య జాగ్రత్తలతో డెంగీకి దూరం కావచ్చని రాకోడు పీహెచ్‌సీ వైద్యాధికారిణి ఎస్.శ్రావణి అన్నారు. డెంగీ నివారణ మాసోత్సవాల్లో భాగంగా పీహెచ్‌సీ పరిధిలోని గ్రామాల్లో మంగళవారం అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రావణి మాట్లాడుతూ వర్షాకాలంలో దోమలు ఎక్కువుగా వృద్ధి చెందుతాయని, వాటి నివారణకు తీసుకోవాల్సిన చర్యలను ప్రజలకు వివరించాలని వైద్య సిబ్బందికి సూచించారు. ప్రజలు వారి ఇళ్ల సమీపంలో మంచినీటి నిల్వలు లేకుండా చూసుకోవాలన్నారు. వాడి పడేసిన కొబ్బరి బొండాలు, పాత టైర్లు, మురుగునీటి గుంటలు లేకుండా చూడాలన్నారు. ప్రజలు డెంగీ వ్యాధి బారిన పడి లక్షణాలు కనిపిస్తే వెంటనే గ్రామాల్లోని వైద్య సిబ్బందికి సమాచారం అందించాలన్నారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ వైద్యురాలు బంగారు అఖిల, సీహెచ్‌ఓ మాణిక్యం, పీహెచ్‌ఎన్ రాముడమ్మ, ఆరోగ్య పర్యవేక్షకులు శ్రీరామ్మూర్తి, శ్రీనివాసరావు, కళావతి, ఆరోగ్య సహాయకులు కృష్ణ, చిన్నారావు, శ్రీనివాసరావు, ల్యాబ్ టెక్నీషియన్ అప్పలనాయుడు, ఫార్మాశిస్టు ప్రసాద్, ఏఎన్‌ఎంలు, ఎంఎల్‌హెచ్‌పీలు, తదితరులు పాల్గొన్నారు.

ఇసుక ట్రాక్టర్ సీజ్

పూసపాటిరేగ: మండలంలోని చంపావతి నది నుంచి అనుమతిలేకుండా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను సీజ్ చేసినట్టు ఎస్‌ఐ ఎ.సన్యాసినాయుడు మంగళవారం సాయంత్రం తెలిపారు. పూసపాటిరేగ సమీపంలో జాతీయ రహదారిపై అనుమతిలేకుండా ఇసుకను తరలిస్తుండగా అదుపులోకి తీసుకున్నట్టు చెప్పారు. పూసపాటిపాలెంకు చెందిన ఆర్.శేఖర్ ట్రాక్టర్‌గా గుర్తించి కేసు నమోదు చేశామన్నారు.

రైతులకు వరి విత్తనాలపంపిణీ



రైతులకు వరి విత్తనాలు పంపిణీ చేస్తున్న సర్పంచ్ ఉప్పాడ విజయభాస్కర్ రెడ్డి

భోగాపురం: ఖరీఫ్ సాగుకు అవసరమైన వరి విత్తనాలను సవరవిల్లి గ్రామ రైతులకు సర్పంచ్ ఉప్పాడ విజయభాస్కర్ రెడ్డి మంగళవారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో టీడీపీ మండలశాఖ అధ్యక్షుడు కర్రోతు సత్యం, పంచాయతీ కార్యదర్శి బిపిన్ చంద్ర, అగ్రికల్చర్ అసిస్టెంట్ శ్రావణి, పూసర్ల వెంకటరమణ, రైతులు పాల్గొన్నారు.

విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్

విజయనగరం పూల్‌బాగ్: జీసీసీ సోప్ యూనిట్‌లో పనిచేస్తున్న కార్మికుడిని తక్షణమే విధుల్లోకి తీసుకోవాలని జీసీసీ సోప్ యూనిట్ వర్కర్స్ యూనియన్ (సీఐటీయూ అనుబంధ సంఘం) గౌరవాధ్యక్షుడు ఎ.జగన్‌మోహన్‌రావు మంగళవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. విజయనగరం జీసీసీ సోప్ యూనిట్‌లో పనిచేస్తున్న బోర ఆదినారాయణను అనారోగ్య కారణాలను చూపించి ఎలాంటి నోటీసు ఇవ్వకుండా విధుల నుంచి తొలగించడం తగదన్నారు. గత 90 రోజులుగా పనిలేక అతని కుటుంబం ఆర్థికంగా ఇబ్బంది పడుతోందని, మార్చి, ఏప్రిల్, మే, జూన్ నెలల వేతనం చెల్లించాలన్నారు. కార్మికుడిని విధుల్లోకి తీసుకోకుంటే డిప్యూటీ కమిషనర్ ఆఫ్ లేబర్‌కు ఫిర్యాదు చేస్తామని తెలిపారు.

6న ఆదర్శ పాఠశాలల ప్రవేశ పరీక్ష

నెల్లిమర్ల రూరల్: మండలంలోని సతివాడ ఆదర్శ పాఠశాలలో 7, 9 తరగతుల్లో మిగుల సీట్ల భర్తీకి ఈ నెల 6న ప్రవేశ పరీక్ష నిర్వహిస్తామని ప్రిన్సిపాల్ పద్మలత మంగళవారం తెలిపారు. ఏడో తరగతిలో ఒక సీటు, తొమ్మిదో తరగతిలో 3 సీట్లు ఖాళీగా ఉన్నాయన్నారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు పరీక్ష జరుగుతుందన్నారు. ఆయా తరగతుల్లో ప్రవేశాలకు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు ఉదయం 9 గంటలకు ఆదర్శ పాఠశాలకు చేరుకోవాలని కోరారు.

కార్యదర్శులపై చర్యలకు డిమాండ్



మేనేజర్‌కు వినతిపత్రం అందజేస్తున్న కౌన్సిలర్లు

నెల్లిమర్ల: పింఛన్ల పంపిణీలో ప్రొటోకాల్ పాటించాలని నగర పంచాయతీ వైఎస్సార్‌సీపీ కౌన్సిలర్లు మైపాడ ప్రసాద్, చిక్కాల సంతోష్‌కుమార్, మొయిద శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. వార్డు సచివాలయ కార్యదర్శులు ఎటువంటి ప్రొటోకాల్ పాటించకుండా ఎన్డీయే కూటమి నాయకులు, కార్యకర్తలతో కలిసి పింఛన్లు పంపిణీ చేయడంపై అభ్యంతరం తెలిపారు. కార్యదర్శులపై చర్యలు తీసుకోవాలంటూ నగర పంచాయతీ కౌన్సిలర్ మేనేజర్ విశ్వేశ్వరరావుకు మంగళవారం వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు పైల మురళీ, బూర సత్తిబాబు, కారుకొండ హరీష్, తదితరులు పాల్గొన్నారు.

జిల్లాను అభివృద్ధి పథంలో నడిపించండి



కలెక్టర్ అంబేద్కర్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న భవిరెడ్డి, తదితరులు

విజయనగరం టౌన్: జిల్లాను అభివృద్ధి పథంలో నడిపించాలని కలెక్టర్ డాక్టర్ బీఆర్.అంబేద్కర్‌కు బీజేపీ జాతీయ కౌన్సిల్ సభ్యుడు, మాజీ జిల్లా అధ్యక్షుడు భవిరెడ్డి శివప్రసాదరెడ్డి కోరారు. కలెక్టర్‌ను మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు. జిల్లాలోని నిరుద్యోగ యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాల కల్పనకు కృషిచేయాలన్నారు. మూతబడిన పరిశ్రమలు తెరిపించాలని, రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధర కల్పించేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. జిల్లాలో పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న పేద విద్యార్థులు చదువుకునేందుకు వీలుగా గురజాడ కేంద్ర గ్రంథాలయంలో ఉన్న గురజాడ కళాభారతి వేదిక ముందు పైకప్పు నిర్మించాలని కోరారు. కలెక్టర్‌ను కలిసిన వారిలో బీజేపీ రాష్ట్ర మాజీ కార్యవర్గ సభ్యులు పాణంగిపల్లి అశోక్, దక్షిణ మండల అధ్యక్షుడు ఇప్పిలి గోపాలకృష్ణ, రూరల్ మండలాధ్యక్షుడు కంది సీతారాం, తదితరులు పాల్గొన్నారు.

యువతి అదృశ్యం

భోగాపురం: మండలంలోని చాకివలస గ్రామానికి చెందిన యువతి అదృశ్యంపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై సూర్యకుమారి తెలిపారు. గత నెల 28న ఇంటి నుంచి బయటకు వెళ్లిన ఆమె ఇంతవరకు ఇంటికి రాకపోవడంతో యువతి తండ్రి సోమవారం రాత్రి ఫిర్యాదు చేశారు. ఈ మేరకు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

సమయపాలన తప్పనిసరి



సమావేశంలో మాట్లాడుతున్న ఎంఈఓ మూర్తి

నెల్లిమర్ల: ఉపాధ్యాయులు సమయపాలన పాటించాలని ఎంఈఓలు యు.ఎస్.ఎన్.మూర్తి, ఈపు విజయకుమార్ సూచించారు. మండలంలోని ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు స్థానిక ఎంఈఓ కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. ప్రధానోపాధ్యాయులు ప్రార్థన కార్యక్రమాన్ని క్రమశిక్షణగా నిర్వహించాలని సూచించారు. నిరంతర ప్రక్రియలు సక్రమంగా నిర్వహించేలా చూడాలన్నారు. విద్యార్థుల హాజరు 10.30లోగా వేయించడం, టాయిలెట్స్ శుభ్రంగా ఉంచేలా చూడడం, నైపుణ్యంతో కూడిన విద్యను బోధించడం, మధ్యాహ్న భోజనాన్ని నాణ్యత ఉండేలా చూడడం తదితర అంశాలపై దృష్టిపెట్టాలన్నారు. స్టూడెంట్ కిట్ ఇప్పటికే అన్ని పాఠశాలలకు పంపిణీ చేశామని చెప్పారు. కార్యక్రమంలో ట్రైబల్ వెల్ఫేర్ ఆశ్రమ పాఠశాల ప్రిన్సిపాల్ కె.సూర్యనారాయణ, అన్ని ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, సీఆర్‌ఎంటీఓ, ఎంఈఓ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

అలరించిన లయనందాల హరి



లయనందాలహరి నిర్వహిస్తున్న మండపాక రవి, తదితరులు

విజయనగరం టౌన్: సిరుల తల్లి పైడితల్లి అమ్మవారి ఆలయ ప్రాంగణంలో మంగళవారం రాత్రి మృదంగ విద్వాంసులు మండపాక రవి నిర్వహించిన లయనందాల హరి ఆద్యంతం ఆహుతులను ఆకట్టుకుంది. మంగళంపల్లి బాలమురళీకృష్ణ స్వరపరిచిన గంభీరనటరాగ వర్ణంతో కార్యక్రమాలను ప్రారంభించి, అంబా పైడిమాంబ విజయనగరం వాసిని భజే అనే పల్లవితో ప్రస్తావించి అనేక గతులలో లయవిన్యాసం చేసి అందరిమన్నలు పొందారు. శ్రీరుద్ర మృదంగంలో నమకాన్ని వాయించి చివరగా బృందావన రాగం థిల్లానతో ముగించారు. వయోలిన్‌పై భానుహర్ష, తాళం, గాత్రంపై మహేశ్వరరావు సహకారమందించారు. అనంతరం ఆలయ అర్చకులు, సిబ్బంది విద్వాంసులను ఆశీర్వదించి, సత్కరించారు.

రామేశ్వరం పయనమైన కళాకారులు



రామతీర్థం సీతారామస్వామి సన్నిధిలో భజన కళాకారులు

నెల్లిమర్ల రూరల్: మండలంలోని తంగుడుబిల్లి గ్రామానికి చెందిన శ్రీరామ భజన మండలి కళాకారులు మంగళవారం రామేశ్వరం పయనమయ్యారు. సుప్రసిద్ధ పుణ్యక్షేత్రం రామతీర్థం సీతారామస్వామిని కళాకారులు భక్తి శ్రద్ధలతో దర్శించుకున్నారు. అనంతరం స్వామి సన్నిధిలో భక్తి భజనలు, కోలాటాం నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీరామ భజన మండలి ప్రతినిధి లెంక పైడినాయుడు మాట్లాడుతూ రామతీర్థం సేవా సంఘం ఆధ్వర్యంలో ఇప్పటివరకు 415 దేవాలయాల్లో భక్తి భజనలతో పాటు కోలాట కార్యక్రమాలు నిర్వహించామన్నారు.

416వ భజన, కోలాట ప్రదర్శనను రామేశ్వరంలో చేపట్టేందుకు వెళ్తున్నట్టు తెలిపారు. హిందూ సంస్కృతిని భావితరాలకు చాటి చెప్పేందుకు ప్రసిద్ధ ఆలయాల్లో భజన కార్యక్రమాలకు శ్రీకారం చుట్టామన్నారు. కార్యక్రమంలో అర్చకులు, పలువురు కళాకారులు పాల్గొన్నారు.

సమాజ శ్రేయస్సుకోసం రోటరీ సేవలు



సమావేశంలో మాట్లాడుతున్న రోటరీ అంతర్జాతీయ పూర్వ అధ్యక్షుడు రొటేరియన్ శేఖర్ మెహతా

విజయనగరం టౌన్: సమాజ శ్రేయస్సే లక్ష్యంగా రోటరీ క్లబ్ సేవలందిస్తున్నట్టు రోటరీ పూర్వ అంతర్జాతీయ అధ్యక్షుడు రొటేరియన్ శేఖర్ మెహతా తెలిపారు. జూలై ఒకటో తేదీ నుంచి ప్రారంభమైన రోటరీ సంవత్సరానికి క్లబ్ సభ్యుడైన డాక్టర్ ఎం.వెంకటేశ్వరరావును డిస్ట్రిక్ట్ గవర్నర్‌గా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఎస్‌వీఎన్‌లో మంగళవారం ఏర్పాటుచేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ప్రపంచ వ్యాప్తంగా 200 దేశాల్లో రోటరీ సేవలందిస్తోందన్నారు. 34 జోన్స్‌లో 17 మంది బోర్డు డైరెక్టర్లు, 535 డిస్ట్రిక్ట్ గవర్నర్లు ఉన్నారన్నారు. వీరంతా వారి పరిధిలో సేవలు అందిస్తున్నారని తెలిపారు. ఈ ఏడాది మేజిక్ ఇయర్‌గా అభివర్ణించారు. పోలియో రహిత దేశంగా భారత దేశాన్ని చేసుకున్నామన్నారు. పాకిస్తాన్, ఆఫ్ఘనిస్తాన్ దేశాల్లో తప్పితే మిగతా 25 దేశాల్లో పోలియో నిర్మూలించుకోగలిగామన్నారు. చిన్నారులకు హార్ట్ ఆపరేషన్‌లు, విద్య, బ్లడ్ బ్యాంక్‌లు తదితర సేవలను విస్తృతం చేసినట్టు వెల్లడించారు. ఎం.వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ఏపీలో ఉమ్మడి కృష్ణా జిల్లా నుంచి శ్రీకాకుళం జిల్లా వరకు ఉన్న ప్రాంతాన్ని రోటరీ ఇంటర్నేషనల్ డిస్ట్రిక్ట్ 3020గా పరిగణిస్తారని, ఈ ఏడాది తనకు సేవలందించే అవకాశం దక్కడం అదృష్టంగా భావిస్తున్నట్టు తెలిపారు. అనంతరం పోలియో రహిత సమాజం కోసం ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో రోటరీ పూర్వప్రెసిడెంట్ ఆర్.సుబ్బారావు, క్లబ్ అధ్యక్షుడు వినోద్‌కుమార్, ప్రతినిధులు భోగరాజు సూర్యలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

కౌలు రైతులకు సీసీఆర్‌సీ కార్డుల జారీ



సిబ్బందికి సూచనలు చేస్తున్న తహసీల్దార్ చంద్రశేఖర్

కొత్తవలస: మండలంలోని అర్హత కలిగిన కౌలు రైతులను గుర్తించి వారికి కౌలు పత్రాలు(సీసీఆర్‌సీ)ను జారీ చేయాలని తహసీల్దార్ ఎస్.చంద్రశేఖర్ ఆదేశించారు. రెవెన్యూ కార్యదర్శులు, వ్యవసాయశాఖ అధికారులతో మంగళవారం తన కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అన్ని గ్రామాల్లో బుధవారం నుంచి కౌలు రైతు గుర్తింపు సదస్సులు నిర్వహించాలని సూచించారు. అర్హులను గుర్తించి వారికి సీసీఆర్‌సీ కార్డులు జారీ చేయాలన్నారు. ఈ నెల 10వ తేదీలోగా ఈ ప్రక్రియను పూర్తిచేయాలన్నారు. భూమిని కౌలుకు ఇచ్చే రైతుకు, తీసుకున్న రైతుకు సీసీఆర్‌సీ కార్డుల జారీపై అవగాహన కల్పించాలన్నారు. మండలంలో గత ఏడాది 263 మంది రైతులకు కౌలు పత్రాలను అందించామని, ఈ ఏడాది 320 మందికి కౌలు గుర్తింపు పత్రాలు జారీ చేయాలని లక్ష్యాన్ని నిర్దేశించినట్టు చెప్పారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ తమటపు రమేష్, వ్యవసాయధికారి కె.మాధురీశరణ్య, ఆర్ఐ సీహెచ్.రాజేష్, తదితరులు పాల్గొన్నారు.